క్లుప్తంగా

అందుబాటులో వరి విత్తనాలు

మాగనూర్: మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో వరి విత్తనాలు ఆర్ఎన్ఆర్, బీపీటీ, 1010 రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని సింగిల్‌విండో చైర్మన్ వెంకట్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్‌కార్డు, పట్టాదారు పుస్తకం జిరాక్స్ కాపీలను తీసుకొని కార్యాలయంలో సంప్రదించి విత్తనాలు తీసుకెళ్లాలని కోరారు.

క్రీడాకారులకు బంగారు భవిష్యత్

మక్తల్: క్రీడాకారులకు బంగారు భవిష్యత్ ఉంటుందని రాష్ట్ర పీసీసీ కార్యవర్గ సభ్యుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండంలోని లింగంపల్లిలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన జట్లకు ఆయన బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి రూ.25 వేల నగదు సొంతంగా ఆయన అందజేశారు. అదేవిధంగా ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.15 వేలు వీజేఆర్ అధినేత వర్కటం జగన్నాత్ రెడ్డి ప్రకటించారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఎండీ మౌలాలి, విజయ్, అనిల్, లక్ష్మీకాంత్, మైమూద్, కాశయ్యనాయుడు, డీలర్‌నాగేష్, శేఖర్, దేవరి రాము, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

బీసీలను కించపరిస్తే ఊరుకోం

మక్తల్: బీసీలను అవమానించే విధంగా వ్యాఖ్యలు చేస్తే సంహిచమని బీసీ సేన జిల్లా అధ్యక్షుడు సేలిటి వెంకటేష్ అన్నారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరు సమావేశంలో ఆయన మాట్లాడారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నోరు అదుపులో పెట్టుకోవాలని సూచించారు. యాదవులను, వంశరాజు కులస్తులను కించపరిచే విధంగా మాట్లాడటం తగదన్నారు. మరోమారు పునరావృత్తం అయితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. కార్యక్రమంలో రమేష్, కృష్ణయ్య, వెంకటేష్, నాగప్ప, చంద్రప్ప రవి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపిక

మక్తల్: మండలంలోని కర్ని జెడ్పీహెచ్ఎస్ పాఠశాల పీఈటీగా పని చేస్తున్న రూప రాష్ట్ర స్థాయి క్రీడల పోటీల నిర్వహణ కోసం కోచ్‌గా ఎంపికైంది. ఈ నెల 29, 30 తేదీల్లో హైదరాబాద్‌లో గచ్చిబౌలి, జింఖానా, ఎల్‌బీ, సరూర్‌నగర్ స్టేడియంలో ఖోఖో పోటీలను నిర్వహించనున్నారు.

విగ్రహాల ఊరేగింపు

మక్తల్: పట్టణంలో చెరువు కట్ట దగ్గర నూతనంగా ఈదమ్మ విగ్రహాలను ప్రతిష్ఠాపనలో భాగంగా పడమటి ఆంజనేయస్వామి ఆలయం నుంచి చెరువు కట్ట వరకు ట్రాక్టర్‌పై ఊరేగించారు. అనంతరం విగ్రహాలకు ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ప్రత్యేకంగా పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసి కోళ్ళ వెంకటేశ్, మధుసూదన్‌రెడ్డి, శ్యామ్, లక్ష్మన్, శ్రీహరి, మహిపాల్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి, రవిశంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు అందజేత



మక్తల్: మండలంలోని చిన్నగోప్లాపూర్ గ్రామానికి చెందిన రాధమ్మ అనారోగ్యంతో బాధపడుతోంది. దీంతో ఆస్పత్రి ఖర్చుల కోసం సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకోగా రూ.25,500లు మంజూరయ్యాయి. ఆదివారం మండల కేంద్రంలో బాధితురాలికి ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి చెక్కు అందజేశారు. కార్యక్రమంలో మక్తల్ పట్టణ అధ్యక్షుడు అమరేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కర్ణాటక మంత్రికి సన్మానం

నర్వ: కర్ణాటక చిన్న నీటి పారుదల శాఖ మంత్రిగా ప్రమాణం స్వీకారం చేసిన ఎన్ఎస్ బోసు రాజును ఆదివారం నారాయణపేట డీసీసీ అధ్యక్షుడు వాకిటి శ్రీహరి ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బెంగళూరులో ఆయన స్వగృహంలో కలిసి పూల మాలలు, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆయన వెంబడి మండల అధ్యక్షుడు బీసం చెన్నయ్యసాగర్ తదితరులున్నారు.

పీహెచ్‌సీలో బీపీ మాత్రలు కరువు

అమరచింత: మండల కేంద్రంలోని డీఎంఅర్ఎం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బీపీ, షుగర్ మాత్రలు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రఘు తెలిపారు. నెల రోజులుగా ఆస్పత్రికి బీపీ, షుగర్ మాత్రల కోసం వస్తున్న ప్రజలకు మాత్రలు లేవని సిబ్బంది వెనక్కి పంపిస్తున్నారని, అయినా సంబంధిత శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను పట్టించుకోవట్లేదని మండిపడ్డారు. మండల కేంద్రంలో ఉన్న ఆస్పత్రికి వివిధ గ్రామాల నుంచి జ్వరం, ఇతర వ్యాధులతో బాధపడుతూ వస్తున్న వారికి సరైన వైద్యసేవలు అందటం లేదని ఆరోపించారు. జిల్లా వైద్యాధికారి చొరవ చూపి పేదలకు అవసరమయ్యే బీపీ, షుగర్ మాత్రలను అందుబాటులో ఉంచాలని, లేని పక్షంలో ఆస్పత్రి ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా చేస్తామని హెచ్చరించారు.

ఆక్రమణలతో అవస్థలు

- వాహనదారుల ఇక్కట్లు
- పట్టించుకోని అధికారులు



మాగనూర్ బస్టాండ్ చౌరస్తాలో రోడ్లపై చిరువ్యాపారులు

మాగనూర్: మండల కేంద్రంలో ఉండే బస్టాండ్, పాఠశాల ప్రాంతాల్లో రహదారులు ఆక్రమణకు గురవుతున్నాయి. దీంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో రహదారులు, డ్రైయినేజీలపై కొందరు వ్యాపారులు కొనసాగిస్తున్నారు. బస్టాండ్ చౌరస్తా నుంచి బ్యాంకు వైపు మీదుగా అంబేడ్కర్ చౌరస్తా వరకు డ్రైయినేజీలపై పండ్లను, వివిధ వస్తువులు విక్రయిస్తున్నారు. అక్రమంగా రోడ్లను ఆక్రమించుకుంటూ బస్సులు వెళ్లేందుకు, పాదచారులు నడిచేందుకు కూడా ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వ్యాపారులు రోడ్లపై సరుకులు పెడుతూ వాహనదారులకు ఇక్కట్లు తప్పడం లేదు. చిరు వ్యాపారులు తోపుడు బండ్లు ఏర్పాటు చేయడంతో సమస్య మరింత జటిలమైంది. ఇరుకుగా మారిన రోడ్లలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.

ఆక్రమణ.. ఆపై అద్దెకు..

కొందరు వ్యాపారులు తమ దుకాణాల ముందు రహదారులు, డ్రైయినేజీలను ఆక్రమించుకొని వ్యాపారాలు చేస్తుండగా.. మరికొందరు నిర్మాణాలు చేసి ఇంకొందరికి అద్దెకు ఇచ్చారు. ఆక్రమించిన స్థలాల్లో రూ.1000 నుంచి రూ.2000 వేల వరకు అద్దెకు ఇస్తున్నారు. ఆటోలు కూడా ఎక్కడ పడితే అక్కడ ఆటోలు నిలుపుతుండటంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్ల ఆక్రమణలను తొలగించి గ్రామస్తుల ఇబ్బందులు తీర్చాలని కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలి..

అనుమతి లేకుండా రోడ్లను ఆక్రమించుకున్నవారిపై చర్యలు తీసుకోవాలి. ఆక్రమణలతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండ్ చౌరస్తాలో రోడ్లపై దర్జాగా తోపుడుబండ్లను ఏర్పాటు చేశారు. కొందరు సరుకులు అడ్డంగా పెట్టి ముందుకు వెళ్లేందుకు కూడా వీలు లేకుండాపోతోంది. అధికారులు సమస్యను పరిష్కరించాలి.

– మహేష్, మాగనూర్ గ్రామస్తుడు.

చర్యలు తీసుకుంటాం..

బస్టాండ్ చౌరస్తాతో పాటు ప్రధాన కూడలిలో ఆక్రమణలను తొలగించేందుకు వెంటనే చర్యలు ప్రారంభిస్తాం. వ్యాపారులు సహకరించకపోతే చట్టపరంగా ముందుకు వెళ్తాం. ప్రయాణికులు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

– రాజు, సర్పంచ్ మాగనూర్

ఆక్రమణలను తొలగిస్తాం..


నిబంధనలకు విరుద్ధంగా రోడ్లను ఆక్రమించుకొని వ్యాపారం చేస్తేన్న వారిపై చర్యలు తీసుకుంటాం. ప్రయాణికులకు ఇబ్బందులు కలుగకుండా చిరు వ్యాపారులు సహకరించాలి. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం లేకుండా చర్యలు చేపడుతాం.

– అమీర్, ఇన్‌చార్జ్ తహసీల్దార్ మాగనూర్

ప్రభుత్వ సర్వేయర్ ఎక్కడ?

- మండలానికి రాడు.. సమస్య పరిష్కరించడు
- ఫోన్ చేస్తే తన చేతికింది సర్వేర్లను పంపిస్తున్న తీరు

మరికల్: భూ సమస్యలను పరిష్కరించాలని బాధిత రైతులు మండల సర్వేయర్ కోసం మండల తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన దుస్థితి మండలంలో చోటు చేసుకుంది. ఆయన ఫోన్‌లో తప్ప కంటికి కన్పించిన సందర్భాలు లేవని రైతులు వాపోతున్నారు. మరికల్, ధన్వాడ మండలాలకు కలిపి కలెక్టర్ ఓ సర్వేయర్‌ను నియమించారు. ధన్వాడ మండలంలో వారంలో ప్రతి సోమవారం, మంగళవారం, బుధవారం అందుబాటులో ఉండాలి. మరికల్ మండలంలో గురువారం, శుక్రవారం, శనివారం అందుబాటులో ఉండి భూ సమస్యలపై వచ్చిన ఫిర్యాదుదారుల భూములను సర్వే చేయడం ఆయన బాధ్యత. కాని ఆయన మాత్రం కంటికి కన్పించడం లేదని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 8 నెలల క్రితం సర్వేయర్‌గా బాధ్యతలు చేపట్టిన అధికారి ఏదో సందర్భంలో మాత్రమే ఇలా తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి అలా వెళ్లిపోతుంటాడు. పది సార్లు ఫోన్ చేస్తే ఒకసారి స్పందించని ఆయన తన కింద ఉన్న సర్వేయర్లను పంపించడం వల్ల భూ సమస్యలు పరిష్కారం కావడం లేదని బాధితులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్ స్పందించి మండలానికి రెగ్యులర్ సర్వేయర్‌ను నియమించాలని బాధిత రైతులు కోరుతున్నారు.



సర్వేయర్ ఎప్పుడు ఎక్కడ ఉండే వివరాల పట్టిక

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



మక్తల్‌లో అప్పటి గురువులతో పూర్వ విద్యార్థులు

మక్తల్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2006–2007 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకొని అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సంబరపడ్డారు. ఎన్నో ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో సంతోషం వ్యక్తం చేశారు. అంతకుముందు అప్పటి గురువులను సన్మానించారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, రాంరెడ్డి, లాలూప్రసాద్, దయాకర్, బంగారం గాయిత్రి, జ్యోతి, అనిత, నర్మద, శ్యామల, చైతన్య, శ్రీవాణి, అరవిందు, నవిత, తదితరులు పాల్గొన్నారు.

ఊట్కూర్: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల 1997–98 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం 25 సంవత్సరాల సిల్వర్ జూబ్లీ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. అప్పటి గురువులు ఎ.లింగారెడ్డి, గోవిందప్ప, శంకరయ్య, వెంకట్‌రాములు, రామ్మోహన్‌రావు, లక్ష్మారెడ్డి, సావిత్రమ్మలను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు జెడ్పీటీసీ అశోక్ కుమార్‌గౌడ్, నర్సింహారాజు, శ్రీనివాస్, వెంకట్‌రాములు, బానుచందర్, రఘువీర్, గంగాధర్, కృష్ణ, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.



ఊట్కూర్‌లో..

వేగంగా రీ బీటీ రోడ్డు పనులు



ధన్వాడ: మండల కేంద్రం నుంచి కొండాపూర్ వరకు.. రామకిష్టాయిపల్లి నుంచి మరికల్ వరకు ఆర్ అండ్‌బీ రోడ్డు రెనివల్ పనులు వేగంగా చేస్తున్నారు. ఆదివారం నాటికి పనులు చివరి దశకు చేరుకున్నాయి. మండలంలో ఆర్అండ్‌బీ కింద ఉన్న అన్ని బీటీ రోడ్లలో రెనివల్ పనులు చేస్తున్నారు. అలాగే కొండాపూర్ నుంచి చర్లపల్లి వరకు ఉన్న పంచాయతీరాజ్ బీటీ రోడ్డును కూడ రీ బీటీ వేయాలని ఆయా గ్రామాల ప్రజలు వేడుకుంటున్నారు.

ఎత్తిపోతల పథకం చేపట్టాలి

నారాయణపేట టౌన్: రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల సందర్భంగా జూన్ 7 తేదీన నిర్వహిస్తున్న సాగునీటి దినోత్సవం నారాయణపేట జిల్లా రైతులకు సాగునీరు సంకట దినోత్సవంగా మారిందని జలసాధన సమితి జిల్లా కోకన్వీనర్ నర్సింహ ఒక ప్రకటనలో ఆదివారం పేర్కొన్నారు. నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల పథకం కోసం అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జీఓ 69ను జారీ చేశారని, నేటికీ పదేళ్లు అవుతున్నా.. కేవలం సర్వే చేసి పాతిన రాళ్లు మాత్రమే మిగిలి ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 69 జీఓ రద్దు చేసి నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల పథకం పూర్తి చేయకుండా జిల్లా రైతులకు అన్యాయం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జూన్ 7న నిర్వహించే సాగునీటి దినోత్సవం రోజున జిల్లా రైతులకు ఈ జీఓ ఎందుకు రద్దు చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు.

తెలుగు ఖ్యాతిని చాటిన ఘనుడు ఎన్టీఆర్



జిల్లా కేంద్రంలో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు



కోస్గిలో ఎన్‌టీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

నారాయణపేట టౌన్: తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారకరామారావు శత జయంతిని ఆదివారం జిల్లా కేంద్రంలో ఘనంగా జరుపుకొన్నారు. టీడీపీ పార్టీ నియోజకవర్గ కోఆర్డీనేటర్, ఓబీసీ జనమోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్రిక వినయ్‌కుమార్‌యాదవ్ అధ్వర్యంలో సత్యనారాయణ చౌరస్తాలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గోపాల్‌యాదవ్, మండల అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, వీరన్న ఆవిటి, శివకుమార్, గోపి, శ్రీకాంత్, వీరన్న, సత్యనారాయణ గౌడ్, బాలాజీ యాదవ్, బస్సయ్య స్వామి తదితరులు పాల్గొన్నారు.

దేశం గర్వించదగ్గ వ్యక్తి..

ఎన్టీఆర్ శత జయంతి వేడుకల్లో భాగంగా టీడీపీ ఉమ్మడి జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు ఓం ప్రకాశ్ నేతృత్వంలో ఆదివారం సెంటర్ చౌక్‌లో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ చిన్నపిల్లల ఆస్పత్రిలో పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేశారు.

కోస్గి: టీడీపీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు శత జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక శివాజీ చౌరస్తాలో ఎన్టీఆర్ చిత్రపటానికి పార్టీ పట్టణ అధ్యక్షుడు కుమ్మరి అంజిలయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు అచ్యుతారెడ్డి, అమృతారెడ్డి, అంబదాస్, మోహన్‌జీ, రాములు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

నర్వ: మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు గొప్ప యుగపురుషుడని టీడీపీ మండల అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఎన్టీఆర్ శత జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు వెంకటేశ్వర్‌రావు, కుర్మారెడ్డి, జగన్నాథం, మమతరామన్‌గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, ఆంజనేయులు, మాజీ ఎంపీటీసీ ఖాసీం, పాల్గొన్నారు.

గ్రామాల సమగ్రాభివృద్ధికి పెద్దపీట

కోయిల్‌కొండ: రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల సమగ్రాభివృద్ధికి పెద్ద పీట వేస్తోందని నారాయణపేట ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని పలు అభివృద్ధి పనులకు ఆదివారం శంకుస్థాపనలు చేశారు. ఈసందర్భంగా మల్కాపూర్‌లో రూ.10లక్షలతో ఎస్సీ, బీసీ కమ్యూనిటీహాల్, కనాయపల్లిలో రూ.20లక్షలతో గ్రామపంచాయతీ భవనం, కనాయపల్లి నుంచి పారుపల్లి వరకు రూ.20లక్షలతో రోడ్డు నిర్మాణం, చంద్రాస్‌పల్లిలో 17లక్షలతో సీసీరోడ్డు, డ్రైయినేజీ నిర్మాణాలు, ఖాజీపూర్‌లో తిమ్మయ్య చెరువు వరకు రూ.16లక్షలతో రోడ్డు నిర్మాణం, కోయిల్‌కొండ నుంచి చంద్రాస్‌పల్లి వరకు బీటీరోడ్డు రెన్యువల్, అంకిళ్ల గేటు నుంచి చందాపూర్ వరకు బీటీరోడ్డు రెన్యువల్, అంకిళ్లలో నాబార్డ్ నిధులు రూ.76లక్షలతో గోదాం నిర్మాణాలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ శశికళ, జెడ్పీటీసీ విజయ్‌భాస్కర్ రెడ్డి, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను అడ్డుకున్న తండా వాసులు

మండలంలోని వర్దన్నపల్లితండాకు రోడ్డును వేయించాలని గిరిజనులు మల్కాపూర్ నుంచి కనాయపల్లికి వెళ్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి అడ్డుకున్నారు. ప్రస్తుత రోడ్డు ఇబ్బందికరంగా ఉండడంతో చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోందని, కొంత మంది రైతులు తమ పొలాల్లో రోడ్డు స్థలాన్ని కేటాయిస్తే సమస్య తీరుతుందని తెలిపారు. ఎమ్మెల్యే స్పందించి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

వాహనాలకు నంబర్ ప్లేట్ తప్పనిసరి



అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

నారాయణపేట రూరల్: ప్రతి వాహనానికి నెంబర్ ప్లేట్ తప్పనిసరిగా ఉండాలని ట్రాఫిక్ పోలీసులు అన్నారు. ఆదివారం పట్టణంలోని పాతబస్టాండ్ చౌరస్తాలో తనిఖీలు చేపట్టి నెంబర్‌ప్లేట్ లేని వాహనదారులకు హెచ్చరికలు జారీ చేశారు. ఈసందర్భంగా పోలీసులు మాట్లాడుతూ.. నెంబర్‌ప్లేట్ లేకపోతే సదరు వాహనాలను క్రైం చేయడానికి వాడుతున్నారని గుర్తించాల్సి వస్తుందన్నారు. నిబంధనల ప్రకారమే నెంబర్ ప్లేట్ ఏర్పాటు చేయాలని, ఇష్టారీతిగా ఉండరాదని సూచించారు. అదేవిధంగా జర్నలిస్టులు కాని వారు ప్రెస్ స్టిక్కర్లు పెట్టకోవద్దని సూచించారు. వాహనం నడిపే సమయంలో హెల్మెట్, సీటు బెల్టును తప్పనిసరిగా ఉపయోగించాలని, అవి మన ప్రాణాలను కాపాడుతాయన్నారు. అతి వేగం ప్రమాదకరమని, నిర్ణత వేగంతోనే వాహనాలను నడపాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరమని అందుకు వాహన యజమానులు, పిల్లల తల్లిదండ్రులు శిక్షార్హులన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేస్తామని, ఇష్టారీతిగా పార్కింగ్ చేయరాదని, ఇతర వాహనాలకు ఆటంకం కల్గిస్తే జరిమానా కట్టాల్సి వస్తుందన్నారు.

ఎలక్ట్రీషియన్ల సంక్షేమం కోసం పాటుపడాలి



వెంకటేష్‌ను సన్మానిస్తున్న రాజేశ్వర్‌రెడ్డి

మరికల్: ప్రమాదం అంచున్న పని చేస్తున్న ఎలక్ట్రికల్ కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేశ్వర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మాకం శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన మండల స్థాయి కార్మికుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎలక్ట్రికల్ రంగంలో పని చేస్తున్న కార్మికులు అందరూ పేదరికంతో అల్లాడుతున్నారని వాపోయారు. రోజూ పని చేస్తేనే వారికి పూట గడిచే దుర్భర స్థితిలో నెట్టుకొస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం మంజూరు చేసిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల మంజూరు చేసి తమ కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. అలాగే 50 ఏళ్ల నిండిన కార్మికులకు పింఛన్, పనులు చేసే సమయంలో ఏదైనా ప్రమాదం జరిగి మృతి చెందిన కార్మికుడి కుటుంబానికి రూ. 10 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం గ్రామ నూతన కమిటీ అధ్యక్షుడిగా సూరిటి వెంకటేష్, ఉపాధ్యక్షులుగా రాఘవేందర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా ప్రతాప్‌రెడ్డి, కోశాధికారిగా లక్ష్మారెడ్డి, సహాయ కార్యదర్శిగా రాజు తో పాటు సలహాదారులుగా పది మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, మల్లేష్, కేశవులు, నరేష్, ఆంజనేయులు, శ్రీను, వెంకటేష్ పాల్గొన్నారు.

ఉద్యమం ఉధృతం చేస్తాం



మాట్లాడుతున్న బి.రాము

నారాయణపేట రూరల్: వెనకబడిన కోటకొండపై రాష్ట్ర ప్రభుత్వం చూయిస్తున్న నిర్లక్ష్యాన్ని ఎండగడుతూ రాబోయే రోజుల్లో మండల సాధన ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కార్యదర్శి బి.రాము అన్నారు. మండలంలోని కోటకొండలో నిర్వహిస్తున్న రిలేదీక్షలు 19వ రోజుకు చేరుకోగా ఆదివారం నెమళ్లపల్లి గ్రామస్తులు దీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా దీక్షను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఇటీవల కొడంగల్ నియోజకవర్గంలో కొత్తపల్లి, గుండుమాల్‌లను మండలాలుగా ప్రకటించి అన్ని అర్హతలు ఉన్న కోటకొండను విస్మరించడం తగదని హితువు పలికారు. కార్యక్రమంలో కెంచె శ్రీనివాసులు, బలరాం, కాశీనాథ్, చెన్నప్ప, విజయలక్ష్మి, నర్సింహులు, సలీం, యాదగిరి పాల్గొన్నారు.

సురవరం ప్రతాప్‌రెడ్డి సేవలు మరువలేనివి



సురవరం చిత్రపటం వద్దనివాళులర్పిస్తున్న రెడ్డి సేవా సమితి సభ్యులు

నారాయణపేట రూరల్: పట్టణంలోని కృష్ణగోకులం స్కూల్‌లో ఆదివారం రెడ్డిసేవాసమితి ఆధ్వర్యంలో సురవరం ప్రతాప్‌రెడ్డి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన చేసిన సేవలను కొనియాడారు. సురవరం ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అదే విధంగా పేద రెడ్డి విద్యార్థుల అభ్యున్నతికి తోడ్పాటు అందించడానికి ముందుకు నడుద్దామన్నారు. జిల్లా అధ్యక్షుడు కె.సుదర్శన్‌రెడ్డి, కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, సభ్యులు మధుసూదన్‌రెడ్డి, చెన్నారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, తపస్ జిల్లా అధ్యక్షుడు శేర్‌కృష్ణారెడ్డి, ఊట్కూర్ పీఏసీఎస్ వైస్ చైర్మెన్ రాంరెడ్డి, రాఘవరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

వీర సావర్కర్‌కు ఘన నివాళి



సావర్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న భావసమైక్య వేదిక సభ్యులు

నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రంలోని పాతబస్టాండ్ వద్ద ఆదివారం స్వాతంత్ర సమరయోధుడు వినాయక దామోదర సావర్కర్ 141వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ, తపస్, భజరంగ్‌దళ్, భావసమైక్యవేదిక తదితర సంఘాల ఆధ్వర్యంలో వేర్వేరుగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశం కోసం త్యాగం చేసిన మహానుభావుడని, స్వాతంత్రం కోసం జైలు శిక్ష అనుభవించాడని కొనియాడారు. పార్లమెంట్‌లో ఆయన విగ్రహం ప్రతిష్ఠించాలని కోరారు. కార్యక్రమంలో నాగురావునామాజీ, పగుడాకుల శ్రీనివాసులు, రఘురామయ్యగౌడ్, శేర్‌కృష్ణారెడ్డి, నర్సింహ, తిరుపతయ్య, శ్రీనివాస్‌రెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, కురుమన్న, రఘువీర్‌యాదవ్, వెంకటేష్, రఘు తదితరులు పాల్గొన్నారు.

మక్తల్: వీర సావర్కర్ 140వ జయంతి వేడుకలు ఆదివారం పట్టణంలోని ఏబీవీపీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు వినయ్, వంశీశరణ్, వినయ్, నిఖిల్ కిసాన్ సంఘ్ నాయకులు కావలి వెంకటేశ్, అంజనేయులు, ప్రతాప్‌రెడ్డి, రమేష్, విజయ్‌కృష్ణ, మంజునాథ్, మహేష్ సాగర్, తదితరులు పాల్గొన్నారు.

మారెమ్మవ్వ ఆలయాన్ని తొలగించొద్దు



మాజీ ఎంపీకి వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

మాగనూర్: మండల కేంద్రంలోని నల్లగట్టు దగ్గర ప్రసిద్ధిగాపించిన మారెమ్మవ్వ దేవాలయాన్ని భారత్‌మాల రోడ్డు నిర్మాణంలో భాగంగా తొలగించొద్దని కోరుతూ మాజీ పార్లమెంటు సభ్యుడు ఏపీ జితేందర్‌రెడ్డిని ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. ఆదివారం మహబూబ్‌నగర్‌లో మాజీ ఎంపీ నివాసంలో కలిసి సమస్యను వివరించారు. అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజు, మాజీ సర్పంచ్ ఆనంద్‌గౌడ్, మధుసూదన్‌రెడ్డి, పూంజనూర్ అంజనేయులు, అశోక్‌గౌడ్, వెంకటయ్య, వాకిటి శ్రీనివాసు, పల్లెమారెప్ప, అంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక స్థలం వివాదం



శ్మశానవాటిక వద్ద నిరసన తెలుపుతున్న ప్రజలు

ఆత్మకూర్: భూ బకాసురులు శ్మశానవాటికలను సైతం కొల్లగొడుతున్నారు. సమాధులను ధ్వంసం చేసి ఆ స్థలాన్ని ప్లాట్లు చేసి విక్రయిస్తున్నారు. ఆత్మకూర్ పట్టణంలోని సర్వే నంబర్ 439లో 3 ఎకరాల 18గుంటల స్థలంలో వడ్డెర, బోయల శ్మశాన వాటిక ఏళ్లుగా ఉంది. శ్మశానవాటిక స్థలం కబ్జాకు గురైందని, ఆ స్థలాన్ని కాపాడాలంటూ స్థానికులు గతంలోనే కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై పూర్తి స్థాయిలో సర్వే నిర్వహించాల్సి ఉండగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు రంగంలోకి దిగి భూమిని చదును చేసి కంచె ఏర్పాటు చేసుకున్నారు. విషయం తెలుసుకున్న స్థానికులు పెద్దసంఖ్యలో ఆదివారం సంఘటన స్థలానికి చేరుకుని రియల్ వ్యాపారులతో వాగ్వివాదానికి దిగారు. సుమారు మూడు గంటల పాటు శ్మశానవాటిక స్థలం వద్ద నిరసన తెలిపారు. నాలుగు తరాలుగా వడ్డెర, బోయల శవాలకు ఇక్కడే అంత్యక్రియలు నిర్వహిస్తున్నామని, ప్రస్తుతం ఈప్రాంతంలో భూముల ధరలు ఆకాశాన్నంటడంతో రియల్టర్ల కన్ను పడిందని వాపోయారు. వీరి నుంచి స్థలాన్ని కాపాడాలని వారు కోరుతున్నారు. కార్యక్రమంలో పెద్ద నర్సింహ, కురుమూర్తి, బుచ్చన్న, నాగన్న, బాలస్వామి, ఆంజనేయులు, బాలు, రాములు, నర్సింహ, చిన్న, నాగన్న తదితరులు ఉన్నారు.